# హదీస్ పబ్లికేషన్స్

## పరిచయం

దైవ ప్రవక్త (స)వారి ప్రవచనాలను తిరస్కరించటానికి ఉద్యమించిన విరోధుల దుష్ట యత్నాలు క్రొత్తవేమీ కావు. కానీ ప్రస్తుత కాలంలో ధర్మం గురించి విసుగు చెందిన, పాశ్చాతుల ఆలోచనా సరళికి చెందిన, అన్ని విధాల కట్టుబాట్లను విడనాడదలచుకున్న అనేక మంది భ్రష్టులు కట్టుదిట్టంగా నూతన విధానాలతో ఆ దుష్కార్యాన్ని నెరవేరుస్తున్నారు. ప్రవక్తగారి ప్రవచనాల గురించి అజ్ఞానం వల్ల, ఆ దుర్మార్గుల వలలో అతి తేలిగ్గా చిక్కుకుంటున్నారు. సన్మార్గ అనుసరణ కొరకు దివ్య ఖుర్ఆన్ బోధనలు మాత్రమే సరిపోతాయని, దైవప్రవక్తగారి ప్రవచనాల అవసరం లేదని భావించటం భ్రష్టత మరియు మూర్ఖత్వం అవుతుంది. స్వయంగా దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రవచనాల ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. తన అంతిమ హజ్‌యాత్ర సందర్భాన ప్రసంగిస్తూ దైవప్రవక్త ఈ విధంగా వక్కాణించారు.

నేను మీ మార్గదర్శకం కొరకు మీ యందు రెండు ఆధారాలు విడిచి వెళ్ళు చున్నాను. మీరు ఆ రెండింటినీ దృఢంగా పట్టుకుని ఉన్నంతకాలం మార్గభ్రష్టులు కాజాలరు. ఆ రెండు ఇవి. **1.** అల్లాహ్ యొక్క గ్రంథమైన దివ్య ఖుర్ఆన్, **2.** ఆయన ప్రవక్త యొక్క (సున్నత్) సదాచార విధానం, ప్రవచనాలు (హదీస్).

కనుక స్పష్టమయ్యేదేమిటంటే సన్మార్గ దర్శనం మరియు సత్య ధర్మానుసరణ కావాలంటే దివ్య ఖుర్ఆన్ మరియు పవిత్ర హదీసులు (ప్రవక్తగారి ప్రవచనాలు), ఈ రెండూ తప్పనిసరిగా కావాలి. ఇస్లాం ధర్మ ఆధారాల ద్వారా తెలిసేదేమిటంటే ఇస్లాం ధర్మశాస్త్ర నిర్మాణంలో దివ్య ఖుర్ఆన్ మరియు పవిత్ర హదీసులు, ప్రవచనాలు ఒకే స్థాయికి చెందిన రెండు దృఢమైన ఆధారాలు. అందుకని పవిత్ర హదీసులను, ప్రవచనాలను సందేహాస్పదాలుగా వర్ణించి తిరస్కరిస్తే పూర్తి ఇస్లాం ధర్మాన్నే తిరస్కరించినట్లవుతుంది.

అందుకే దివ్య ఖుర్ఆన్ వలె పవిత్ర హదీసుల, ప్రవచనాల ప్రాముఖ్యతను స్పష్టపర్చటం, వాటిని బోధించటం తప్పనిసరి. ఈ విధంగా ఈ ముఖ్య బాధ్యతను నెరవేర్చటానికి క్రీ.శ. 1987లో ఈ సంస్థ యొక్క ఒక శాఖ హైదరాబాదు-ఇండియాలో స్థాపించబడింది. ఈ సంస్థ లక్ష్యాలు ఈ క్రింద అతి క్లుప్తంగా ఇవ్వబడుచున్నవి.

1. ఇస్లాం ధర్మంలో, ధర్మశాస్త్ర నిర్మాణంలో దైవప్రవక్తగారి హదీసుల, ప్రవచనాల యదార్థ స్థానాన్ని మరియు వాటి ప్రాముఖ్యతను స్పష్టపరచటం.
2. దైవప్రవక్తగారి ప్రవచనాలకు విరుద్ధంగా చేయబడిన దుష్టాచారాలను, కల్పించ బడిన అపోహలను ఖండించి దుర్మార్గుల చేత సృష్టించబడిన అనుమానాలను, సందేహాలను నిర్మూలించటం.
3. దివ్య ఖుర్ఆన్ మరియు పవిత్ర హదీసుల వెలుగులో ఇస్లాం ధర్మ బోధనలను సులభ రీతిలో సామాన్య ప్రజల వద్దకు చేరవేయటం.

teluguislam.net


ఈ ఉత్తమలక్ష్యాల సాధనయే మా ధ్యేయం. ఇందు గురించి మేము చేయదలచు కున్న దేమిటంటే, పవిత్ర హదీసుల ప్రసిద్ధ గ్రంథాల ముఖ్య అధ్యాయాల ఆధారంగా సులభ భాషలో, సామాన్యరీతిలో ప్రవచనాలతో పాటు వాటి అనువాదం ఉండునట్లుగా, క్లుప్తంగా మరియు అందమైన రూపంలో పుస్తకాలు తయారుచేసి ప్రచురించాలి. ఈ విధంగా మేము తయారు చేసిన పుస్తకాల్లో సత్య స్వచ్ఛ ప్రవచనాలతో పాటు, అంతకంటే కొద్దిగా తక్కువ స్థానానికి చెందిన, ఆమోదిత, స్వీకార యోగ్యమైన ప్రవచనాలు కూడా పేర్కొనబడినవి. "ఇత్తెబాయె సున్నహ్ (ప్రవక్త-సఅసం-విధానం)" అనే ఈపుస్తకంలో సంగ్రహించిన ప్రతి హదీసులో దాని ప్రామాణికతతో బాటు హదీసు నెంబరు కూడ ఇవ్వటం జరిగింది. హదీసు తరువాత ఇవ్వబడిన ఈ నెంబరు అల్లామా నాసిరుద్దీన్ అల్‌బానీ (రహ్మ.అలై)గారి పరిశోధనానుసారం హదీసు గ్రంథాల ప్రామాణికత / బలహీనత అనే విభజన జరగక పూర్వం ఇవ్వబడినది. మన దేశంలో ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న హదీసు గ్రంథాలు సాధారణంగా పై కోవకు చెందినవే.

అందుకే మేము పాదసూచిక (ఫుట్‌నోట్)లలో ఇవ్వబడిన రెఫరెన్సులకు సంబంధించి అల్లామా నాసిరుద్దీన్ అల్‌బానీ (రహ్మ)గారు హదీసుల పరిశోధన జరిపి, సహీహ్ (ప్రామాణికమైన), జయీఫ్ (బలహీనమైన) హదీసు గ్రంథాలను విభజన చేసిన తరువాత ఇచ్చిననెంబర్లను తీసుకున్నాము. ఇలాంటి విలక్షణం మనదేశంలో ఉన్న హదీసు పుస్తకాలలో ఇంకా సర్వసామాన్యం కాలేదు. అంటే పైన మూలంలో ఒక నెంబరు ఉంటే క్రింద పాదసూచికలో వేరొక నెంబరు ఉంటుంది. పాదసూచికలో ఉన్న నెంబరు అల్‌బానీ గారిది. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరని కోరుతున్నాము.

అల్లాహ్ దయవల్ల మా ధార్మిక సంస్థ అతి స్వల్పకాలంలో ఊహించిన విధంగా ప్రోత్సాహకరమైన ప్రగతి సాధించింది. ఈ సంస్థ ఇస్లాం ధర్మానికి సంబంధించిన వివిధ అంశాలపై 29 పుస్తకాలను ప్రచురించింది. దానికి తోడుగా ఈ ధార్మిక సంస్థ ఉర్దూ భాషలోనే కాక ఆంగ్లం మరియు తెలుగు, హిందీ భాషలలో కూడా వివిధ అంశాలపై ధార్మిక పుస్తకాలను ప్రచురించి, ఇస్లాం ధర్మసేవలో నిమగ్నమై ఉంది.

వివిధ అంశాలైన ప్రళయ సంకేతాలు, ఇస్లాంలోస్నేహం-విరోధం, వారసత్వ హక్కుల ఆదేశాలు, వర్తక వివరాల ఆదేశాలు, దివ్యఖుర్‌ఆన్ ప్రాశస్త్యం, కారుణ్యప్రవక్త విశిష్ఠత, ఇస్లాంలో మస్జిదుల వ్యవస్థ, సద్వర్తనల ఆదేశాలు మొదలగు నవి కూడా అల్లాహ్ దయ తలిస్తే - ప్రచురింపబడతాయి. అల్లాహ్ అనుగ్రహం వల్ల, దైవ ప్రవక్తగారి ప్రవచనాల ప్రచారం చేయటం, వాటిని కాపాడటం, విరోధుల దాడి నుండి వాటిని రక్షించటం మొదలగు లక్ష్యాలతో మేము చేయు కృషి ఇస్లాం సేవలో ఒక ప్రముఖ భాగం మరియు ప్రయోజనకారి కాగలదని ఆశిస్తున్నాం. మా ప్రయత్నాలు అల్లహ్ అనుగ్రహంపైనే ఆధారపడి ఉన్నాయి. మేము అల్లాహ్‌నే నమ్ముకున్నాము. మా మనసు ఆయన పట్లనే లగ్నమై ఉన్నది.

అల్లాహ్ మనందరిని ఖుర్‌ఆన్, హదీసులపైన అమలు పరిచేవిధంగా సద్బుద్ధిని కలిగించాలని ఆశిస్తున్నాము. ఆమీన్. - అజీజుర్రహ్మాన్ యూనుస్, హదీస్ పబ్లికేషన్స్